గిరిజనులు మీ సమస్యలు చెప్పుకోండి

9491041188కు ఫోన్ లేదా మెసేజీ చేయండి

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

గిరిజన ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేసేందుకు 9491041188 ఫోన్ నెంబర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలు సదరు ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసిన, మెసేజీ పెట్టి తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఉ(ము)ప్పుటేరు..!

చౌడుబారుతున్న పంటభూములు - పాలకుల నిర్లక్ష్యానికి నిలువటద్దం ఉప్పుటేరు - డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పునరుద్ధరణ తప్పనిసరి

ఉప్పుటేరులో పేరుకుపోయిన కిక్కిస, జమ్ము

ప్రజాశక్తి - కాళ్ల

దశాబ్దాలుగా ఉప్పుటేరు సమస్య పరిష్కారం కావడం లేదు. ఎన్ని ప్రభుత్వాలు, ఎంతమంది పాలకులు మారుతున్నా ఈ సమస్యపై దృష్టి పెట్టడం లేదు. కృష్ణా, తూర్పు, పశ్చిమ డెల్టాలోని సుమారు 6.60 లక్షల ఎకరాల్లోని మురుగు నీటిని సముద్రంలోకి తరలించే ప్రధాన డ్రెయిన్. కొల్లేరు ముంపు నీటితోపాటు పశ్చిమ, ఏలూరు కృష్ణా జిల్లాలో వందకుపైగా మేజర్ డ్రెయిన్లు, 67 మీడియం మైనర్ డ్రెయిన్లలోని మురుగునీరంతా ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తుంది. సాగునీటికి, ఆక్వా రంగానికి నీటి అవసరాలను ఉప్పుటేరు తీరుస్తుంది. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దీంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. మూడు జిల్లాల పరిధిలో ఉప్పుటేరు డ్రెయిన్ ఉంది. దీనిపై పర్యవేక్షణ కొరవడింది. గుర్రపుడెక్క, తూడు పెద్దఎత్తున మేటలేస్తోంది.

ఉప్పుటేరు స్వరూపం

కొల్లేరు సరస్సు ముఖద్వారం పందిరిపల్లిగూడెం వద్ద ఒకటో మైలు రాయి నుంచి సముద్రపు ముఖద్వారం 49వ మైలురాయి వరకూ ఉప్పుటేరు ప్రవహిస్తోంది. సుమారు 68 కిలోమీటర్ల మేర దూరం వరకూ ఉప్పుటేరు ప్రవహిస్తోంది. 750 మీటర్ల నుంచి 1200 మీటర్ల వెడల్పులోనూ, 36 అడుగుల లోతులో ఉప్పుటేరు 16 వేల క్యూసెక్కుల నీటితో నిండి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉప్పుటేరు పూడుకుపోవడంతో కేవలం 28 అడుగుల లోతులోనూ, 8 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహంతో కుచించుకుపోయింది. దీంతో నీటి ప్రవాహం మందగిస్తోంది. ఫలితంగా ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని లక్ష ఎకరాల వరి పంట నీట మునుగుతుంది. సముద్రపు పోటు సమయంలో ఉప్పునీరు అధికంగా ఎదురు ప్రవహిస్తోంది.

అటకెక్కిన మిత్ర కమిటీ సూచనలు

1964లో అప్పటి ప్రభుత్వం మిత్ర కమిటీని నియమించింది. దీనిపై ఆ కమిటీ 1977లో ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించింది. ఉప్పుటేరు ఆరంభంలో ఆకివీడు రైల్వే వంతెన వద్ద కాలువ 36 మీటర్ల వెడల్పు ఉండగా, దానిని 200 మీటర్ల మేరకు వెడల్పు చేయాలని కమిటీ సూచించింది. తొలి విడతలో ఉప్పుటేరులో ప్రవాహ సామర్థ్యాన్ని కనీసం 15 వేల క్యూసెక్కులకు పెంచాలని స్పష్టం చేసింది. అనంతరం 1982లో అదే కమిటీ రెండోసారి నివేదిక ఇచ్చింది. అప్పటి సూచనల మేరకు 1983లో తాడినాడ, పెదలంక, మాట్లం, కలిదిండి ప్రాంతాల్లో 43 ఎకరాల భూమి సేకరించి డ్రెడ్జింగ్ పనులు చేపట్టారు. అప్పట్లో 6.6 కిలోమీటర్ల నుంచి 23.4 కిలోమీటర్ల వరకు పనులు చేసి ఆపేశారు. ఉప్పుటేరులో పూడిక తొలగించి 30 ఏళ్లు దాటింది. ప్రస్తుతం దీని ప్రవాహ సామర్థ్యం 8 వేల క్యూసెక్కులు ఉంది. కనీసం 15 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచితే రైతులకు కొంతైనా ప్రయోజనం కలుగుతుంది. 2009లో రూపొందించిన ప్రతిపాదనల ప్రకారం రూ.21.27 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. తర్వాత చాలాసార్లు అంచనా వ్యయం పెంచి ప్రతిపాదనలు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మిస్తే ఏడాదిపాటు డ్రెయిన్ నీటితోనే సాగు చేసుకోవచ్చని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బి.రోశయ్య ఆధ్వర్యంలోని కమిటీ 2007లో ప్రతిపాదించింది. 1/6 మైలు వద్ద రూ.25 కోట్లతో ఒక రెగ్యులేటర్, సముద్రం సమీపాన 43వ మైలు వద్ద రూ.25 కోట్లతో రెండో రెగ్యులేటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అవేమీ కార్యరూపం దాల్చలేదు. దీంతో వరిసాగుకు ముప్పు వాటిల్లుతోంది. భూములు చౌడుబారుతున్నాయి.

ఉప్పుటేరులో పూడిక తొలగించాలి

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి

దశాబ్దాలుగా ఉప్పుటేరు సమస్య ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా సమస్య పరిష్కరించడం లేదు. లక్షల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్లే మార్గం ఉప్పుటేరే ప్రధానంగా ఉంది. ఉప్పుటేరులో 10 వేల క్యూసెక్కుల నుంచి 12 వేల నీటితో క్యూసెక్కుల సామర్థ్యం ఉంది. ఉప్పుటేరు వెడల్పు, లోతు పెంచాలి. గతంలో డ్రెడ్జింగ్ యంత్రాలతో ఉప్పుటేరులో పూడిక తొలగించేవారు. గతంలో టిడిపి ప్రభుత్వం డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను మూసివేసింది. దీంతో యంత్రాలు, సిబ్బంది లేరు. సిద్ధాపురంలో ఉప్పుటేరులో ఉన్న అడ్డంకులను తొలగించాలి. రైల్వే బ్రిడ్జి కింద ఖానాల్లో పూడిక ఉండటంతో నీటి ప్రవాహనికి అడ్డంకిగా ఉంది. ఉప్పుటేరు పోటు వల్ల వరి పొలాలు ప్రతియేటా ముంపునకు గురై రైతులు నష్టపోతున్నారు. ముంపు లేని సమయంలో ఉప్పునీరు రాకుండా రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టాలి. వరద నీరు వెళ్లేలా సామర్థ్యం పెంచేలా చర్యలు చేపట్టాలి. ఉప్పునీరు పంట, మురుగు కాలవల్లోకి రాకుండా రైతులు సొంత ఖర్చులతో అడ్డుకట్టలు వేయాల్సి వస్తుంది. ఉప్పుటేరు ముంపు, కాలుష్యాన్ని పరిష్కరించాలి. పరిశ్రమల కాలుష్యం ఉప్పుటేరు లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి. రైతులు, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉప్పుటేరు సమస్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలి.

ర్యాలీలో జాతీయ జెండాతో కలెక్టర్, జెసి, డిఆర్ఒ

ప్రతిఒక్కరూ జాతీయ జెండా ఎగరేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ సమైక్యత, సమగ్రతలను చాటిచెప్పే జాతీయ జెండాను ప్రతిఒక్కరూ తమ ఇళ్లపై ఎగురవేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం క్రీడలు, పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి ప్రజలచే 'హర్ ఘర్ తిరంగా' ప్రతిజ్ఞను కలెక్టర్ చేయించారు. అనంతరం ఇండోర్ స్టేడియం నుండి ఫైర్‌స్టేషన్ వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర సమరయోధుల త్యాగాల ఫలితంగా మనం ఈ రోజు స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధికి ప్రతిఒక్కరూ అంకితం కావాలన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా జాతీయ ఐక్యతా భావాన్ని పెంపొందించేలా సైకిల్, బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీలో 125 అడుగుల పొడవు గల జాతీయ జెండా పట్టుకుని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి చాటారు. కస్తూరిబా బాలికోన్నత పాఠశాలల, సెయింట్ థెరిస్సా కళాశాల విద్యార్థులు, యువతీ యువకులు నగర ప్రధాన కూడళ్లలో సుమారు 800 మంది ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ డి.పుష్పమణి, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఎస్‌డిసిలు ఎం.ముక్కంటి, కె.బాబ్జి, సెట్‌వెల్ ఇన్‌ఛార్జి సిఇఒ మధుభూషణరావు, జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ఎస్.పట్టాభిరామయ్య, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, ఏలూరు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, డిఇఒ అబ్రహం, ఉద్యాన శాఖ డిడి రామ్మోహనరావు, బిసి కార్పొరేషన్ ఇడి నాగరాణి, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తిరంగా కాన్వాస్‌పై సంతకం, ఆపై జాతీయ జెండాతో కలెక్టర్ సెల్ఫీ

కలెక్టర్, ఎస్‌పి, జెసి సెల్ఫీ

ఆజాదికా అమృత్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన తిరంగా కాన్వాస్‌పై సంతకం చేసి జాతీయ జెండాతో సెల్ఫీ ఫొటో తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి సెల్ఫీ తీసుకుని వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని పిలుపునిచ్చారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

వినియోగంపై ఫిర్యాదుల నమోదు, డి-అడిషన్ కేంద్రాల సేవలకు టోల్‌ఫ్రీ నెంబర్ 14446 ఏర్పాటు

అవగాహనా ర్యాలీలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్

ర్యాలీలో కలెక్టర్, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి - ఏలూరు

సమాజ శ్రేయస్సుకు మాదక ద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. 'నాషాముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై మంగళవారం కలెక్టరేట్ వద్ద అవగాహనా ర్యాలీని జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో పూర్తిగా రూపుమాపే యజ్ఞంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి నేటి యువత బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, నాటుసారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని, మాదకద్రవ్యాలు సరఫరా చేసే పెడ్లర్స్‌ను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలు సరఫరా చేసే వారిపై ఇంతవరకు 149 కేసులు నమోదు చేసి, 540 మందిని అరెస్ట్ చేశామన్నారు. మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగాలపై ఫిర్యాదుల నమోదు, డి-అడిషన్ కేంద్రాల సేవల నిమిత్తం టోల్‌ఫ్రీ నెంబర్ 14446 ఏర్పాటు చేశామని, ఈ నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు, ఫిర్యాదులు తెలియజేయవచ్చని తెలిపారు. మాదకద్రవ్యాల వ్యసనం నుండి విముక్తులను చేసేందుకు ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో డి-అడిక్షన్ సెంటర్‌ను కూడా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ కలెక్టర్ నేతృత్వంలో పోలీస్ శాఖ మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగించే వారి సమాచారాన్ని తెలియజేసేవారికి రివార్డులు ప్రకటించామన్నారు. మెడికల్ షాపుల్లో మత్తుకు సంబంధించి ఏవిధమైన మందులు విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూజివీడులో ట్రిపుల్ ఐటి, జిల్లాలోని వివిధ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేసి మాదక ద్రవ్యాల వినియోగానికి తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి రాకడ మణి, ట్రాన్స్‌కో ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, ఎస్‌డిసిలు ఎం.ముక్కంటి, కె.బాబ్జి, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, ఎపిఎంఐపి పీడీ రవికుమార్, ఏలూరు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఘంటా సుధాకర్, డిఇఒ అబ్రహం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్, ఎస్‌పి

మిషన్ శక్తి బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం కింద నూరు రోజుల ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహణలో భాగంగా మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి మొక్కలు నాటారు. అదే విధంగా నషాముక్త్ అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలోనూ వారు మొక్కలు నాటారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు



విరాళాలు సేకరణ

కేరళ వయనాడ్ బాధితుల సహాయార్థం ఐద్వా, బాలల సంఘం ఆధ్వర్యంలో మౌలానా అబ్దుల్ కలాం ఉర్దూ పాఠశాలలో మంగళవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కేరళలోని వయనాడ్‌లో వరదలకు కొండచరియలు విరిగిపడి 400 మందికిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజలను ఆదుకోవడానికి విరాళాల సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి సేకరించిన రూ.2290లను సిఐటియు నేతలు పి.కిషోర్, బి.జగన్నాధరావుకు అందించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జె.హరిషాదుర్గ, బాలల సంఘం నేతలు ధీరజ్, యశ్వంత్, అదాలి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పోలవరం ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి రూ.22 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ పనులకు సంబంధించి కూడా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ భూములకు సంబంధించి నిర్వాసితులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. వారికి కేటాయించిన భూములు సర్వే చేసి వారికి అప్పగిస్తామన్నారు. దళారులు నిర్వాసితులను ఇబ్బందులు పెడితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవి, మండల అధ్యక్షులు రాము, నేతలు నాగరాజు, మధు, శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత : ఎంఎల్ఎ

ఏలూరు సిటీ: ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యతనివ్వడంతో పాటూ ఏలూరును సమస్యల రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. నిత్యం ప్రజాక్షేత్రంలో బిజీబిజీగా ఉండే ఎంఎల్ఎ బడేటి చంటి నియోజవకర్గ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు అధిక సమయాన్ని కేటాయిస్తూ వస్తున్నారు. రోజులో తనకున్న సమయంలో ఖచ్చింతగా కొంత సమయాన్ని ప్రజా వినతులు స్వీకరించేందుకు కేటాయిస్తూ ఉండడంతో ప్రజలు కూడా ఆయన్ని కలిసి తమ సమస్యలను తెలిపేందుకు క్యూ కడుతున్నారు. పరిష్కార మార్గాలను సైతం అన్వేషిస్తూ వాటిపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారాయన. ఇందులో భాగంగా సోమవారం పవర్ పేటలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎంఎల్ఎను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరును సమస్యల రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. ప్రజలు తమ సమస్యలు ఏ సమయంలోనైనా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని, పరిష్కారానికి కృషిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

నిడమర్రు: ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు వరినాట్లు వేసుకున్న 90 శాతం రైతులు పూర్తిగా నష్టపోయారని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. భువనపల్లిలో మంగళవారం సిపిఎం నాయకులు గవర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వ్యవసాయరంగంపై నిర్లక్ష్యం వహించి కాలవలు తవ్వకపోవడం, పూడుకుపోయిన డ్రెయినేజీలను బాగు చేయలేకపోవడం వల్ల కురిసిన వర్షాలకు నీరు బయటకు వెళ్లే మార్గాలు లేక, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వెంటనే కాలవలు, డ్రెయినేజీలు తవ్వి రైతులను ఆదుకునేలా కొత్త ప్రభుత్వం ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పరిహారం చెల్లించాలని ఆర్‌డిఒకు వినతి

ముసునూరు: బలివే గ్రామంలో జగనన్న కాలనీల పేరిట అక్రమంగా పేద రైతులకు సంబంధించిన స్థలాలను కేటాయించి, రైతులకు నష్టపరిహారం చెల్లించలేదని, వారిని ఆదుకోవాలని జనసేన నియోజకవర్గ నాయకులు పాశం బాబు కోరారు. ఈమేరకు మంగళవారం రైతులను ఆదుకోవాలని నూజివీడు నియోజకవర్గ పరిధిలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ వై.భవానీశంకరికి వినతిని అందజేశారు. బలివే గ్రామంలో కోర్టులో ఉన్న రైతుల స్థలాలను జగనన్న కాలనీల పేరిట ఎలా కేటాయించారని, వారికి ఇంత వరకు ఎలాంటి పరిహారం చెల్లించకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులు పెడుతున్నారని, వారికి వేరేచోట స్థలం కేటాయించి న్యాయం చేయాలని నూజివీడు నియోజకవర్గ జనసేన నాయకులు పాశం నాగబాబు వారి సమస్యను ఆర్‌డిఒ దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం వినతి పత్రం అందజేసి బాధితులతో వారి సమస్యను వివరించారు. స్థానిక రైతులతో పాటు జనసేన నాయకులు తోట వెంకట్రావు, గొంగాడ ఉమామహేశ్వరరావు, షేక్ ఇమ్రాన్, బొబ్బిలి శ్రీకాంత్, సూరిశెట్టి శివ, ఏనుగుల చక్రి, జనసేన నాయకులు బత్తిన విజయ్, గోపి, శ్రీను పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ ప్రారంభం

జీలుగుమిల్లి: మండలంలోని ములగలంపల్లి పంచాయతీలోని సంపద తయారీ కేంద్రంలో మంగళవారం చెత్త నుంచి సంపద తయారు చేయడానికి బెడ్స్ సిద్ధం చేసినట్లు ఎంపిడిఒ కెఎమ్.మంగతాయారు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాల్లో వేసి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్, సర్పంచులు చిర్రి జగదాంబ, రాజు, డివిజన్ ఫిల్డ్ కో ఆర్డినేటర్ నాగేశ్వరావు, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి : ఆర్‌డిఒ

మాట్లాడుతున్న ఆర్‌డిఒ భవానీశంకరి

నూజివీడు టౌన్: బాలికలు ఉన్నత లక్ష్యాలకు అనుగుణంగా శ్రమించాలని, చదువుకొనటమే కాక ఆటలు, పాటలు, నృత్యం, యోగా తదితర అంశాలను నేర్చుకోవడం సంతోషకరమైన విషయమని ఆర్‌డిఒ భవానీశంకరి అన్నారు. మంగళవారం నూజివీడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో నూజివీడు ఎంఇఒ జమలయ్య అధ్యక్షతన ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌డిఒ భవాని శంకరి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా పట్టుదలతో చదవాలన్నారు. బాల్య వివాహాల వయసు, అలాగే గుడ్‌టచ్, బాడ్‌టచ్ గురించి బాలికలను అడిగి తెలుసుకుని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం ఎక్కడైనా జరుగుతున్నట్లయితే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఒ వైఎస్.నూరాని మాట్లాడుతూ మిషన్ శక్తి భారత ప్రభుత్వ పథకం అని, ఈ పథకంలో మహిళలు, బాలికలకు సంబంధించి భేటీ బచావో బేటి పడావో, ఉమెన్ హెల్ప్ లైన్ సఖి సదన్ సఖి నివాస్ మొదలగు కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమ ముఖ్య ఉద్దేశం వివక్ష లేకుండా చేసి ప్రతి బాలికకు రక్షణ కల్పించి చదివించడం, ఆడ అయినా మగ అయినా సమానమని సమాజానికి తెలియజేయడమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బేబి, ఇన్‌ఛార్జి స్కూల్ హెచ్ఎంఎస్ వీణా, ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లలో క్రిమిలేయర్ వాదన అర్థరహితం

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప

మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో కెవిపిఎస్ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారే క్రమంలో గత ప్రభుత్వ హయాంలో నియమితులైన స్కీమ్ వర్కర్లను తొలగించడం అన్యాయమన్నారు. వీరిలో అత్యధికులు దళితులు, బిసిలేనన్నారు. గత ప్రభుత్వ విధానాలపై మాట్లాడకుండా కార్మికుల పట్ల కక్ష సాధింపు తగదన్నారు. పౌరసరఫరాల శాఖలో అవకతవకలపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రిజర్వేషన్లను ఎత్తివేసే విధంగా ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్లకు అప్పగిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించినప్పుడు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల్లో క్రిమిలేయర్ వాదన అర్థరహితమన్నారు. అట్రాసిటీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేలా దోషులకు 41 సిఆర్‌సి ప్రకారం నోటీసులిచ్చి విడుదల చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల బాధితులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్‌బాబు, బాగం లక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు బి.రఘురాం, టి.చిరంజీవి, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ, విజయ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్ కుమార్, కె.క్రాంతిబాబు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన దళారుల అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలో పలువురు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి వారికి సొమ్ములివ్వకుండా పరారీలో ఉన్న వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసినట్లు నూజివీడు రూరల్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్, సురేష్ అనే ఇద్దరు అన్నదమ్ములు అన్నవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపుగా రూ.90 లక్షలు విలువైన ధాన్యం కొనుగోలు చేసి సొమ్ము చెల్లించలేదు. దీంతో రైతులు నాలుగు నెలల క్రితం నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నాటి నుంచి ముద్దాయిలు పరారీలో ఉన్నారు. నూజివీడు రూరల్ సిఐ కొప్పిశెట్టి రామకృష్ణ పర్యవేక్షణలో ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి చాకచాక్యంగా ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులోయ హాజరుపర్చారు. వారికి మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రాచన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏజెన్సీ గ్రామాలైనా అంకన్న గూడెం, దిబ్బగూడెం, పూచికపాడు, జగన్నాథపురం గ్రామాలలో మంగళవారం రెండవ విడత దోమల మందు పిచికారీ నిర్వహించినట్లు పిహెచ్‌సి వైద్యాధికారిణి కె.దివ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఇళ్లలోని కుండీలలో నీటి నిల్వలు లేకుండా పాత టైర్లు, కొబ్బరి చిప్పలు ఇళ్లల్లో లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారిణి రాగబింద, సబ్ యూనిట్ అధికారి పెద్దిరాజు, జెడిపిటిసి వసంతరావు, వెంకటలక్ష్మి, బాలాజీ, రవీంద్ర, రాధ పాల్గొన్నారు.

టి.నరసాపురం: మండలంలోని రుద్రకోటంరాజుగూడెంలో డెంగి జ్వరాలు ప్రబలడంతో ఇఒపిఆర్‌డి రాంప్రసాద్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ సిబ్బందితో దోమల నివారణకు మంగళవారం చర్యలు చేపట్టారు. వీధుల్లో తెట్టెదెలాగు తొలగించి, బ్లీచింగ్ చల్లించి దోమల మందు స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

బంధంచర్లలో డెంగీ, మలేరియాపై అవగాహన

ప్రజాశక్తి - టి.నరసాపురం

వాతావరణంలో నెలకొన్న మార్పులకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మండల వైద్యాధికారి డి.కల్యాణరాణి ఆదేశాల మేరకు మండలంలోని బంధంచర్ల గ్రామంలో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపై అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్.సూర్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు దోమకాటు నుంచి అప్రమత్తంగా ఉండాలని, దోమతెరలు వాడాలని, మురుగు నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, పొడుగు దుస్తులు ధరించాలని వారు సూచించారు. జ్వరం, తీవ్ర తలనొప్పి, దగ్గు, కీళ్ల నొప్పులు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ రామకృష్ణ, ఎఎన్ఎం బి.రాణి, ఆశావర్కర్స్ ఎన్.మేరీ ఉన్నారు.

'ధాన్యం డబ్బులు ఇప్పించాలి'

నూజివీడు టౌన్ : ధాన్యం వ్యాపారస్తులైన మల్లూరు వెంకటనాగ చంద్రశేఖర్, అతని సోదరుడు సురేష్ దగ్గర నుంచి ధాన్యం డబ్బులు ఇప్పించాలని ధర్నా నిర్వహించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా రైతులను మోసగించిన అన్నదరులకు చెందిన మల్లూరు వెంకట నాగచంద్రశేఖర్ అతని సోదరుడు సురేష్ దగ్గర నుంచి ధాన్యం డబ్బులు ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం వ్యాపారస్తులు చంద్రశేఖర్, సురేష్‌లు రైతులను మోసగించావారని మే 25వ తేదీన నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో 65 మంది రైతులు కంప్లైంట్ చేయగా కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, దానివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం వ్యాపారస్తుల దగ్గర నుంచి డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ వై.భవానీ శంకరిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, ఎఐటియుసి నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన ఇఇఇ విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు నాల్గవ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులు పెయిడ్ ఇంటర్న్‌షిప్‌లను పొందారు. హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎనర్జీ ఫోటోవోల్టాయిక్ ప్రయివేట్ లిమిటెడ్ అనే కంపెనీకి 18 మంది ఇఇఇ విద్యార్థులు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కోసం ఎంపిక కాబడ్డారు. వీరు ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.15 వేల స్టైఫండ్‌ను అందుకుంటారు. గుంటూరు ఆధారిత 'బిడ్ అర్ట్' కంపెనీకి 20 మంది విద్యార్థులు ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ కోసం ఎంపిక కాబడ్డారు. వీరు ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.15 వేలు స్టైఫండ్‌ను అందుకుంటారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన విద్యార్థులు వారి పనితీరును బట్టి ఉపాధి అవకాశాలను అందుకుంటారు. ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, డైరెక్టర్, టి.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.రత్నాకర్ విద్యార్థులను అభినందించారు.

నేరాలు - ఘోరాలు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

ఇద్దరు దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జాతీయ రహదారిపై దెందులూరు మండలం సత్యనారాయణపురం-కొమరేపల్లి గ్రామాల మధ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి వైపు వెళ్తున్న లారీని డ్రైవర్ భోజనం చేసేందుకు రోడ్డుకు పక్కగా ఆపాడు. విజయవాడ వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు అతివేగంగా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన దొమ్మేటి నాగరాజు (35), జంగారెడ్డిగూడెం మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన యాగంటి సుబ్రహ్మణ్యం(50) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన దొమ్మేటి మనోజ్ కుమార్‌ను ఏలూరు ఆసుపత్రికి తరలించారు. వీరంతా విజయవాడ ఆస్పత్రికి వెళ్లొస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద విసయం తెలియగానే సిఐ నబి, ఎస్ఐ స్వామి సంఘటన స్థలానికి చేరుకున్నారు. లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన కారును జాతీయ రహదారి క్రేన్ సహాయంతో సుమారు గంటపాటు శ్రమించి బయటకు తీశారు. దెందులూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలెండర్ లీకై మంటలు వ్యాప్తి

తప్పిన పెను ప్రమాదం

పెదపాడు: పెదపాడు మండలం కొత్తూరు గ్రామం బిసి కాలనీలో ఉన్న దిమిటి నాగేశ్వరమ్మ ఇంటికి మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. నాగేశ్వరామ్మ వంట చేసుకుంటుండగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. చుట్టుప్రక్కల వారు ఆమెను బయటకు తీసుకువచ్చిన అనంతరం గ్యాస్ సిలిండర్ పేలిపోయి మంటలు వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న పోలీసు, ఫైర్ సిబ్బంది వెనువెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. ఈ సంఘటనలో ఇల్లు మొత్తం కాలిపోయిన ఎవరికీ ఎటువంటి గాయలు కలగలేదు.

దాతృత్వాన్ని చాటుకున్న ఎస్ఐ శుభశేఖర్

పెదపాడు మండలంలోని కొత్తూరు బిసి కాలనీలో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలి జరిగిన అగ్నిప్రమాద ఘటనలో దిమ్మిటి నాగేశ్వరమ్మ సర్వం కోల్పోయింది. ఆ కుటుంబానికి ఎస్ఐ శుభశేఖర్ నిత్యావసర వస్తువులు ఇచ్చి ఆదుకున్నారు. ఎస్ఐ శుభశేఖర్ మంచి మనసుకి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

ఇసుక రవాణాదారులపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు ముసునూరు ఎస్ఐ పి.వాసు వారి సిబ్బందితో కలిసి ముసునూరు గ్రామంలో తెల్లవారుజామున మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, యజమానులపై కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుక ట్రాక్టర్లు ఇసుక రవాణా చేసినట్లయితే వారిపై కఠినచర్యలు తీసుకోవడమే కాకుండా సీజ్ చేయడం కూడా జరుగుతుందని తెలియజేశారు.

సారా బట్టీపై దాడి : వ్యక్తిపై కేసు

ముసునూరు: సారా బట్టీపై దాడిచేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ముసునూరు ఎస్ఐ పి.వాసుకు రాబడిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామంలోని అడివిలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న సారా బట్టీపై ముసునూరు ఎస్ఐ, వారి సిబ్బంది దాడులు నిర్వహించారు. వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి మూడు లీటర్ల నాటుసారా, 600 లీటర్ల బెల్లపు ఊట, గ్యాస్ పొయ్యి, గ్యాస్ బండ, డ్రమ్ములను స్వాధీనం చేసుకుని నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ముసునూరు ఎస్ఐ వాసు తెలియజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఎంపిడిఒగా పద్మావతి దేవి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా సిహెచ్.పద్మావతి దేవి సోమవారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. ఇంతవరకు వీరి స్థానంలో పనిచేసే టి.స్వర్ణలత ఎన్నికల నిబంధనల మేరకు గతంలో తాను పనిచేసిన కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఇదే నేపథ్యంలో గతంలో భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పనిచేసిన పద్మావతి దేవి ఎన్నికల నిబంధన మేరకు కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో తిరిగి భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన పద్మావతి దేవిని పలువురు అధికారులు అభినందించారు.

ఎంపిడిఒగా మంగాకుమారి

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం ఎంపిడిఒగా బిఎస్ఎన్ఎల్ మంగాకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆమె ఫిబ్రవరిలో ఎన్నికల బదిలీల్లో భాగంగా చాట్రాయి మండలానికి బదిలీపై వెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్కడివారక్కడికి వెళ్లాలని చెప్పడంతో తిరిగి ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టారు.

ఎంపిడిఒను కలిసిన టిడిపి నాయకులు

ఎంపిడిఒగా రాణి బాధ్యతలు

ప్రజాశక్తి - ముసునూరు

మండల ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన జి.రాణిని మంగళవారం మండల టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపిడిఒను కలసిన వారిలో మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు గూడపాటి అజయ్ కుమార్, ముసునూరు సర్పంచి కోండేటి విజయ లక్ష్మి తనయుడు బాబి, చెక్కపల్లి సర్పంచి తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, చెక్కపలి మాజీ ఉప సర్పంచి కాటేపల్లి సత్యనారాయణ, నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు.

ఎంపిడిఒగా ప్రేమాన్విత బాధ్యతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా నందిపాటి ప్రేమాన్విత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎంపిడిఒల బదిలీల్లో భాగంగా ఆమె కృష్ణాజిల్లాకు వెళ్లారు. ఎక్కడి వారిని అక్కడే విధులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రేమాన్విత ఉంగుటూరు ఎంపిడిఒగా తిరిగి బాధ్యతలు తీసుకున్నారు. కార్యాలయం పర్యవేక్షకులు ఆంజనేయులు, సీనియర్ సహాయకుడు ఫణి, కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యదర్శి శ్యాంసుందర్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శ్యాంసుందర్ సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. మండలంలోని పెయ్యేరు, దేవపూడి, ప్రొద్దువాక, వాడవల్లి, వి.రావిగుంట, కోడూరు గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన యార్లగడ్డ శ్యామ్‌సుందర్ ఉద్యోగోన్నతిపై కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం సాతులూరు గ్రామపంచాయతీ గ్రేడ్-2 కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా దేవపూడి గ్రామ సచివాలయంలో మంగళవారం శ్యాంసుందర్ సన్మాన సభలో గ్రామ సర్పంచి కాశీ అన్నపూర్ణ విఠల్, పంచాయతీ కార్యదర్శి పి.మనోజ్ కుమార్, ప్రొద్దువాక గ్రామ సర్పంచి సింగనపల్లి రామకృష్ణ, గ్రామ సచివాలయ సిబ్బంది శ్యాంసుందర్‌కు శాలువా కప్పి, పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వ్యాయామం చేయాలి

ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు క్రమం తప్పకుండా ప్రతిరోజూ వ్యాయామం చేసినట్లయితే మానసికంగా, ఆరోగ్యంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో భవిత సెంటర్ ఆధ్వర్యంలో అవసరాల గల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఐఇఆర్‌టియు ఉపాధ్యాయులు డిఎంవి లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రజకులకు ప్రాధాన్యతివ్వాలి'

ఏలూరు అర్బన్: రాష్ట్రంలో ప్రభుత్వం రజకులకు సామాజిక, ఆర్థిక, రాజకీయపరంగా ప్రాధాన్యత ఇవ్వాలని రజక జనసంఘం జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య కోరారు. సోమవారం రజక జనసంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన నాయకుల సమావేశంలో ఈమేరకు సభ్యులు పలు సమస్యలపై తీర్మనాలు చేశారు. నూతనంగా అధికారం చేపట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం ఇవ్వనున్న నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలని రజక జనసంఘం ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టులు ఎఎంసి ఛైర్మన్, ఫెడరేషన్ ఛైర్మన్, డైరెక్టర్స్, గ్రంథాలయ ఛైర్మన్ మొదలగు వాటిలో రజకులకు ప్రాతినిత్యం కల్పించాలని కోరారు. ముఖ్యంగా మెట్టప్రాంతంలో ఎంతోకాలంగా పార్టీలకు సేవ చేస్తున్న వ్యక్తులకు ఎన్‌డిఎ ప్రభుత్వం పూర్తిగా సహకరించి న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రజకుల సంక్షేమం గురించి అనేక జిఒలు ఇచ్చినప్పటికీ నూతన ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 70 శాతం గ్రామాలకు వృత్తి చెరువులను కేటాయించకపోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు. రజక వృత్తిదారులకు ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు పగడాల సాంబశివరావు కోరారు. ఈ కార్యక్రమంలో వితాల శ్రీనివాస్, కొమ్మంటి మురళీ, పి.దుర్గారావు, ఎ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

దెందులూరు: దెందులూరు బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. దీనిలో ప్రథమ బహుమతి భువన, ద్వితీయ బహుమతి మల్లీ పుష్ప, తృతీయ బహుమతిగా ఏసమ్మ ఎంపికయ్యారు. విద్యార్థులు జాతీయ పతాకం రంగులతో విద్యార్థులు, జెండా స్థూపం, విద్యార్థుల రూపాలతో చక్కగా డ్రాయింగ్ వేయడం జరిగింది.

జాతీయ జెండాతో పురవీధుల్లో ర్యాలీ

భీమడోలు : మండల కేంద్రమైన భీమడోలులో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మంగళవారం పలువురు నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు శరీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా 100 మీటర్ల పొడవు గల జాతీయ జెండాతో భీమడోలు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఎంపిపి ప్రాథమిక పాఠశాల నెంబర్-4 నుంచి భీమడోలు తహశీల్దార్ కార్యాలయం మీద జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ఇదేవిధంగా కళాశాల విద్యార్థుల భాగస్వామ్యంతో కూటమి భాగస్వామ్య పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు కార్యక్రమాలు నిర్వహించారు. పురవీధుల్లో జాతీయ జెండాలతో ప్రదర్శనలను చేశారు. వక్తలు స్వాతంత్ర దినోత్సవ ప్రాముఖ్యత గురించి వివరించారు.

కొయ్యలగూడెం: మండల కేంద్రంలో స్థానిక హైస్కూల్ కళాశాల విద్యార్థుల హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 1000 అడుగుల జాతీయ జెండాతో ప్రకాశం డిగ్రీ కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

కైకలూరు సివిల్ కోర్టు జడ్జి లక్ష్మి

ప్రజాశక్తి - ముదినేపల్లి

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కైకలూరు సివిల్ కోర్టు జడ్జి వివిఎన్‌వి.లక్ష్మి అన్నారు. మండలంలోని పెయ్యేరు దళితవాడలో మంగళవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని ప్రజలంతా చట్టాలపై అవగాహన కలిగి ఉండి నడుచుకోవాలన్నారు. అనంతరం జరిగిన వైద్య శిబిరంలో 100 మంది రోగులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, న్యాయవాదులు డి.శివప్రసాద్, ఎంఎస్ఎస్ దుర్గ ప్రసాద్, వైసిపి సీనియర్ నేత జాస్తి బాబు రాజేంద్రప్రసాద్, విఆర్ఓ కె.కేశవ, ఎంఎల్‌హెచ్‌పి డి.ఉష, కానిస్టేబుల్స్ ఎంఎస్ రావు, రామకృష్ణ, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలివ్వాలి

టి.నరసాపురం: మండలంలోని అల్లంచర్ల, రాజుపాలెం రెవెన్యూ పరిధిలో గల అటవీశాఖ, రెవెన్యూ తదితర భూములను దశాబ్దాలుగా బాగు చేసుకుని సాగు చేసుకుంటున్న సోదరులకు కోనేరు రంగారావు భూ కమిషన్ సిఫార్సులు అనుసరించి సదరు భూములు సాగులో ఉన్న ప్రతి ఒక్కరికీ ఒక హెక్టారు భూమికి పట్టాలు ఇచ్చి యాజమాన్య హక్కు కల్పించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు టివిఎస్ రాజు మంగళవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పిస్తామని ఇళ్ల లేని పేదలందరికీ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ప్రతి పేదవానికి మూడు సెంట్లు ఇంటి స్థలం, పక్కా ఇల్లు నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేసి పేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఇటీవల అల్లంచర్ల రాజుపాలెం పరిధిలో బోర్లు వేసి, విద్యుత్ మోటార్లను అమర్చి సాగు చేస్తున్న వారిపై అటవీశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొందరు దళారులు మధ్యవర్తిత్వం చేస్తూ రెవెన్యూ అధికారులు పేదల వద్ద లంచాలు తీసుకుని పట్టాలు, పాసుబుక్కులు ఇచ్చినప్పుడు అటవీశాఖ అధికారులు ఏమయ్యారని ప్రశ్నించారు. వందల ఎకరాలను ఆక్రమించి క్రయవిక్రయాలు చేస్తున్న దళారులకు కాకుండా భూమి కోసం, భుక్తి కోసం పేదరికంలో ఉంటూ కనీస విముక్తి కోసం ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ఎర్రజెండాలతో భూముల్లోకి ప్రవేశించి పేదలకు భూములు పంపిణీ చేస్తామని, ఫారెస్ట్ రెవెన్యూ అధికారులు అడ్డు తగిలితే అరెస్టులకు అయినా సిద్ధపడతామని హెచ్చరించారు.

వితంతు పింఛను పథకాలపై అవగాహన

ఏలూరు అర్బన్: వితంతు పింఛనుకు అర్హులై, ఈ పథకాన్ని పొందడంలో సమస్యలు ఉన్నట్లయితే జిల్లా న్యాయ సేవాధికారి సంస్థను సంప్రదించాలని, వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో వితంతు పింఛనుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన అందరికీ ఈ పథకాన్ని పొందే విధంగా జిల్లా న్యాయసేవాధికారి సంస్థలు సహకరిస్తాయని, వారి కుటుంబం నుంచి ఎటువంటి సమస్యలు అనగా గృహహింస, వారసత్వపు ఆస్తి సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. సెప్టెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.

వృద్ధులు, వికలాంగులకు భోజనం అందజేత

ప్రజాశక్తి - కామవరపుకోట

వృద్ధురాలికి భోజనం అందజేస్తున్న వీరబాబు

ఆకలితో ఉన్న ఆసరా లేని వృద్ధులకు అన్నం పెట్టడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని కామవరపుకోట టౌన్ జనసేన అధ్యక్షుడు బొబ్బిలి వీరబాబు అన్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా కామవరపుకోటలో హెల్పింగ్ హాండ్స్ సంస్థ ద్వారా గత ఐదేండ్లుగా ఆసరా లేని వృద్ధులకు, వికలాంగులకు వారి వద్దకే భోజనం తీసుకు వెళ్లే కార్యక్రమం కొనసాగుతున్న సంగతి విధితమే అని మంగళవారం, బుధవారము రెండు రోజులు పాటు భోజనం అందించడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. అలాగే హెల్పింగ్ హాండ్స్ సంస్థకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అన్నదానం నిర్వహించడానికి ముందుకు వచ్చిన ఆయనకు హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఛైర్మన్ పాపారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

వరకట్న బాధితురాలు మృతి

ప్రజాశక్తి - మండవల్లి

అత్తింటి వారి వరకట్నపు వేధింపులు తట్టుకోలేక వివాహిత మృతిచెందిన సంఘటన కానుకొల్లులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానుకొల్లు గ్రామానికి చెందిన కోరసిక సత్యవతి(24) మానికొండకు చెందిన మెకానికల్ ఇంజనీర్ కుందేటి మణికంఠను మార్చి 22న ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం మానికొండలో సుమారు 20 రోజులు పాటు కాపురం చేసి ఉద్యోగం నిమిత్తం హైదరాబాదులోని బాలానగర్‌లో మూడు నెలలుగా అద్దెకు ఉంటున్నారు. పెళ్లయినప్పటి నుంచి సత్యవతిని అత్తమామలతోపాటు భర్త వరకట్నం కోసం డిమాండ్ చేస్తూ, మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. ఈ క్రమంలో మణికంఠ ఉద్యోగరీత్య ఢిల్లీ వెళ్తున్నానని, నువ్వు మీ ఇంటికి వెళ్లి రూ.5 లక్షలు కట్నంగా తీసుకురమ్మని సత్యవతిని కానుకొల్లు పంపించాడు. అనంతరం కొద్ది రోజుల తర్వాత సత్యవతిని ముదినేపల్లి వరకు తీసుకురమ్మని అక్కడనుంచి హైదరాబాద్ తీసుకెళ్తానని సత్యవతి తండ్రికి మణికంఠ ఫోన్లో చెప్పాడు. దీంతో వివాహిత తండ్రి సత్యవతిని ముదినేపల్లి తీసుకువచ్చి భర్తకు అప్పగించి, ఇరువురిని బస్సు ఎక్కించి వెళ్లిపోయాడు. అయితే మణికంఠ రూ.5 లక్షల తీసుకొస్తున్నావా అని సత్యవతిని అడుగగా సత్యవతి ఎందుకు తీసుకురావాలని సమాధానం చెప్పడంతో కోపోద్రికుడైన మణికంఠ బస్సులోనే సత్యవతిని చితకబాదాడు. అనంతరం అమ్మమ్మ గ్రామం గుడివాడ రూరల్ గ్రామమైన బొమ్ములూరు తీసుకువెళ్లగా మణికంఠ అమ్మమ్మ కూడా వరకట్నంపై ప్రశ్నించి ఇరువురు కలిసి మరోసారి సత్యవతిని కొట్టి అంతటితో ఆగకుండా కూతురితో పాటు రూ.5 లక్షలు ఎందుకు పంపలేదని సత్యవతి తండ్రిని ఫోన్లో ప్రశ్నించి కూతురు బొమ్ములూరులో ఉన్నదని తీసుకెళ్లి పొమ్మని చెప్పారు. హుటాహుటిన సత్యవతి తండ్రి బొంగులూరు వెళ్లి తన కుమార్తెను కానుకొల్లు తీసుకువచ్చి ప్రశ్నించగా జరిగిన తత్తంగాన్ని బోరున విలిపిస్తూ తండ్రికి చెప్పింది. దీంతో సత్యవతి తండ్రి పెద్దలను ఆశ్రయించాడు. ఇరుపక్షాల పెద్దల సమక్షంలో వారిరువురు వేరువేరుగా ఉండి విడాకులు తీసుకునే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. మణికంఠ అంతటితో ఆగకుండా నువ్వు నన్ను వదిలిపెట్టి వేరే పెళ్లి ఎలా చేసుకుంటావో నేను చూస్తాను, నువ్వు నాతో కలిసి ఉన్న ఫొటోలను, వీడియోలను వైరల్ చేస్తానంటూ బెదిరించాడు. దీంతో సత్యవతి భయభ్రాంతులకు గురై చనిపోవాలని నిర్ణయించుకుని ఈనెల 9న శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎలకల పేస్ట్ తినేసింది. ఇది గమనించిన తల్లిదండ్రులు వైద్యం నిమిత్తం గుడివాడలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వైద్యశాలకు చేరుకుని సత్యవతి వాంగ్మూలన తీసుకున్నారు. అయితే సత్యవతి వైద్య సేవలు పొందుతూ 12న సోమవారం సాయంత్రం 6:50లకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చూసుకుని విచారిస్తున్నామని, మృతదేహానికి పంచనామా నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీని కలిసిన పామాయిల్ రైతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారమే తన తదుపరి ప్రాధాన్యత అని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ఆయిల్ ఫామ్ రైతు సంఘాల నాయకులు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ని ఏలూరు క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలసి పామాయిల్ రైతుల సమస్యలు విన్నవించి పరిష్కరించాలన్నారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ రైతు సంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకట్రావు మాట్లాడుతూ కోకోతో సహా ఉద్యానవన పంటల మీద కూడా దృష్టి పెట్టాలని, జిల్లాలో చాక్లెట్ ఫ్యాక్టరీ పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆయిల్ ఫామ్ అధ్యక్షులు బొబ్బా రాఘవరావు, జాతీయ ఆయిల్ ఫామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి క్రాంతికుమార్ రెడ్డి మాట్లాడుతూ 2022లో పామాయిల్ దిగుమతులపై 49 శాతం ఉన్న సుంకాన్ని 0 చేశారని, ఆ కారణంగా దేశంలో ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో సంబంధిత కేంద్ర ప్రభుత్వ సెక్రటరీని కలిశానని, ఆయన మలేషియా వెళ్లి అక్కడి పామాయిల్ పంట పండించే పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారని, అందుకోసం వచ్చే నెలలో మలేషియా వెళ్తానన్నారు. అలాగే వివిధ పంటలు పండించే రైతుల కోసం జిల్లాలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను నెలకొల్పుతామన్నారు. ఎంపీని కలసిన వారిలో పామాయిల్ రైతులు కొసరాజు రాధాకృష్ణ, కొల్లి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన రజక సంఘం సభ్యులు

ముదినేపల్లి: ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌ను ముదినేపల్లి రజక సంఘం సభ్యులు మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మండల రజకసంఘ అధ్యక్షులు యలకుర్తి నాగరాజు, ఉపాధ్యక్షులు మీసాల సత్యనారాయణ, సెక్రెటరీ రావులపాటి సుబ్బారావు ఉన్నారు.

ప్రకటన

IN THE COURT OF THE 3rd ADDITIONAL DISTRICT JUDGE : BHIMAVARAM

O.S.No.1/2013

Plaintiff : Prayaga Subrahmanya Prabhakara Chiranjeevi Rao

Defendants : 1. The Bhimavaram Municipal Council rep., by its Chairman, Bhimavaram Municipality, Bhimavaram and Others

12th Defendant : Gunduboyina Murali krishna, Foested son of Gunduboyina Vanumulu, D.No.14-7-10/4, Sree Lakshmi Narasimha Street, Mini Shiridi Sai Baba Temple Street, 26th ward, Gunupudi, Bhimavaram-1.

పై నెంబరు దావాలో వాది, 12వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు కోర్టు ద్వారాను పోస్టు ద్వారాను జారీ చేయించినప్పటికీ 12వ ప్రతివాది అయిన మీరు సదరు దావా సమన్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. 12వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై నెంబరు దావాను పైకోర్టు వారు **ది.29-8-2024** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. 12వ ప్రతివాది అయిన మీరు సదరు వాయిదా తేదీ ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనియెడల సదరు దావాను 12వ ప్రతివాది అయిన మీ పరోక్షమందు తీర్మానించడమగును.

K.V.SURYANARAYANA
Advocate, Sarrajuvari Street,
Bhimavaram.
Cell : 98494 04488

దస్తావేజులు పోయినవి

ప.గో.జిల్లా పాలకొల్లు పట్టణంకు చెందిన పసుపులేటి రమేష్, రాజీవ్ నగర్, పాలకొల్లు తెలియజేయునది ఏమనగా **ది 01-08-2024** న పాలకొల్లు పట్టణం లోని బెత్లెహేం పేటకు చెందిన మా ఒరిజినల్ స్థలం డాక్యుమెంట్ లు (నెంబర్ 14034) ఒరిజినల్ డాక్యుమెంట్ లు డూప్లికేట్ తీయించుటకు మా ఇంటి నుంచి పాలకొల్లు మెయిన్ సెంటర్ కు వెళుతుండగా దారిలో పడిపోయినవి. ఎంత వెతికినా దారిలో దొరకలేదు.నా ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన నాకు అందజేయగలరు.

సెల్ : 8919014461

ప్రకటన

నా క్లయింటు ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, పి.నైనవరం గ్రామ కాపురస్తులైన చప్పిడి సాంబశివరావు (లేటు) గారి భార్య : చప్పిడి నాగేంద్రమ్మ నుండి సంజాయిషీ పొంది తెలియజేయుట ఏమనగా నా భర్త గారైన చప్పిడి సాంబశివరావు గారు మాదు (లేటు) రాయలు గారి కుమారుడు మాదు నాగయ్య గారి నుండి ఈ దిగువ ఆస్తి ది. 15-9-2011వ తేదీన దస్తావేజు నెం. 7602/2011 గన్నవరం ఎస్ఆర్ఓ నందు రిజిష్టరు పొంది అనుభవిస్తున్నారు. సదరు పై దస్తావేజుకు లింకు డాక్యుమెంటు నెం. 2436/1966 ఎస్ఆర్ఓ గన్నవరం ఒరిజినల్ దస్తావేజు నా వెంట వున్న బ్యాగ్‌తో సహా 7-8-2024 తేదీన ఉదయం 11 గం.లకు ఆకివీడు పాతబస్టాండ్ నుండి గుమ్మలూరు వెళ్ళుటకు ఆటో కోసమని ఎదురు చూస్తున్న సమయంలో పై దస్తావేజువున్న బ్యాగు పోయినది. చుట్టుప్రక్కల వెతికినా కనపడలేదు. పై దస్తావేజుపై ఎవరైనా ఏ విధమైన లావాదేవీలు జరిపిన యెడల చెల్లనేరవని తెలియ జేయటమైనది.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, వెదురు పావులూరు ఆర్.ఎస్. నెం. 207/2, ఎ.సి. 1.06 సెంట్లులో

ఇట్లు
తాడిబోయిన శ్రీనివాసరావు, ఎం.కాం., ఎం.ఎల్.,
న్యాయవాది,
డోర్ నెం. 77-126, ఆర్10,
ఏవీఎస్ రెడ్డి రోడ్డు, పాయకాపురం - 520015.
ఫోన్ : 8096735844, 6300101399

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు సిటీ, ఉప్పు వారి వీధి, డోర్ నెం. 7బి-15-45రు సిటిలోని శ్రీ నాగ హనుమాన్ ఫిష్ పాండ్స్ తరుపున మేనేజింగ్ పార్టనర్ అయిన ఏలూరు పట్టణము, ఉప్పువారి వీధి కాపురస్తులు శ్రీ నూకల రంగారావు గారి కుమారుడు నూకల రామకృష్ణ గారి అస్తికి సంబంధించిన మండవల్లి రిజిష్టర్, మండవల్లి వారి ఆఫీసులో రిజిష్టర్ నెంబర్లు, ఆర్ యస్ నెం. 211/1C లో విస్తీర్ణం 0.1.10 సెంట్లు, ఆర్ యస్ నెం. 211/2C యం. 0.92 సెంట్లు, ఆర్ యస్ నెం. 215లో య.0.89సెంట్లు వెరశి 0.2.90 సెంట్లు గల 571/2008 తేదీ: 10.06.2008రుగా రిజిష్టర్ కాబడియున్నవి. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ ను ఈ రోజు అనగా ది. 13.08.2024వ తేదీన పాలిథిన్ కవర్‌లో పెట్టుకుని ఆ కవరు ను స్కూటర్ ముందు భాగములో పెట్టుకుని ఏలూరు పెద్ద పోస్ట్ ఆఫీసు వద్ద గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ నిమిత్తము తీసుకుని వెళ్ళుచుండగా సదరు కవరు కనిపించలేదు. నా క్లయింట్ వెంటనే వెనుకకు వెళ్ళి వెతకగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లు గల పాలిథిన్ కవర్ దొరకలేదు. నా క్లయింట్ పోగొట్టుకున్న సదరు కవరు పాలిథిన్ కవరు బ్యాగు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రెస్‌కు తెలియజేయగలరు. పై నెంబరు గల డాక్యుమెంట్లు ఎవరైనను దుర్వినియోగము చేసిన యెడల నా క్లయింట్‌ను బైండ్ చేయజాలరు.

మల్లెల శ్రీ గోపాల కృష్ణ, అడ్వకేటు,
డోర్ నెం. 6B-2-87, పోణంగి రోడ్
ఏలూరు దక్షిణపు వీధి, ఏలూరు - 534001.
తేదీ.13.08.2024 సెల్:9885576667

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, భీమడోలు ముప్పవరం గ్రామంలోని శ్రీ నాగ హనుమాన్ సాల్వెంట్ ఆయిల్స్ ప్రయివేటు లిమిటెడ్, తరుపున మేనేజింగ్ డైరెక్టర్ అయిన ఏలూరు పట్టణము, ఉప్పువారి వీధి కాపురస్తులు శ్రీ నూకల రంగారావు గారి కుమారుడు నూకల రామకృష్ణ గారి అస్తికి సంబంధించిన మండవల్లి రిజిష్టర్ మండవల్లి వారి ఆఫీసులో రిజిష్టర్ నెంబర్లు, ఆర్ యస్ నెం.216/1 లో విస్తీర్ణం య. 0.50 సెంట్లు గల 1112/2006 తేది.24.08.2006, ఆర్.యస్.నెం. 224/2లో విస్తీర్ణం య.0.50 సెంట్లు గల 1255/2006- తేదీ.23.09.2006, ఆర్.యస్.నెం.206/3 లో విస్తీర్ణం య.1.09 సెంట్లు గల 1318/2006 తేది.09.09.2006, ఆర్.యస్.నెం. 216/1లో విస్తీర్ణం య.0.75 సెంట్లు గల 919/2006, తేదీ: 05.07.2006 రిజిష్టర్ కాబడియున్నవి. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్‌ను ఈ రోజు అనగా ది. 13.08.2024వ తేదీన పాలిథిన్ కవర్ లో పెట్టుకుని ఆ కవరు ను స్కూటర్ ముందు భాగములో పెట్టుకుని ఏలూరు పెద్ద పోస్ట్ ఆఫీసు వద్ద గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ నిమిత్తము తీసుకుని వెళ్ళుచుండగా సదరు కవరు కనిపించలేదు. నా క్లయింట్ వెంటనే వెనుకకు వెళ్ళి వెతకగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లు గల పాలిథిన్ కవర్ దొరకలేదు. నా క్లయింట్ పోగొట్టుకున్న సదరు కవరు పాలిథిన్ కవరు బ్యాగు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రెస్ కు తెలియజేయగలరు. పై నెంబరు గల డాక్యుమెంట్లు ఎవరైనను దుర్వినియోగము చేసిన యెడల నా క్లయింట్ ను బైండ్ చేయజాలరు.

మల్లెల శ్రీ గోపాల కృష్ణ, అడ్వకేటు,
డోర్ నెం. 6B-2-87, పోణంగి రోడ్
ఏలూరు దక్షిణపు వీధి, ఏలూరు - 534001.
తేది.13.08.2024 సెల్:9885576667

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, పాలకొల్లు పట్టణము, డోర్ నెం.33-2-7Cరు కాపురస్తులు మంచెం హరి గోపాల కృష్ణ గారి భార్య మంచెం వీర కుమారి గారి అస్తికి సంబంధించిన మండవల్లి రిజిష్టర్, మండవల్లి వారి ఆఫీసులో రిజిష్టర్ నెంబర్లు, ఆర్ యస్ నెం.215 లో విస్తీర్ణం 2.00 సెంట్లు ఆర్.యస్.నెం.224/2లో య.0.38 సెంట్లు వెరశి య.3.38 సెంట్లు గల 268/2007 తేదీ: 14.03.2007రుగా రిజిష్టర్ కాబడియున్నవి. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ ను ఈ రోజు అనగా ది. 13.08.2024 వ తేదీన పాలిథిన్ కవర్ లో పెట్టుకుని పాలకొల్లు నుండి ఏలూరు వచ్చి ఏలూరు పెద్ద పోస్ట్ ఆఫీసు వద్ద గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ నిమిత్తము తీసుకుని వెళ్ళు చుండగా సదరు కవరు కనిపించలేదు. నా క్లయింట్ వెంటనే వెనుకకు వెళ్ళి వెతకగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్లు గల పాలిథిన్ కవర్ దొరకలేదు. నా క్లయింట్ పోగొట్టుకున్న సదరు కవరు పాలిథిన్ కవరు బ్యాగు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రెస్ కు తెలియజేయగలరు. పై నెంబరు గల డాక్యుమెంట్లు ఎవరైనను దుర్వినియోగము చేసిన యెడల నా క్లయింట్ ను బైండ్ చేయజాలరు.

మల్లెల శ్రీ గోపాల కృష్ణ, అడ్వకేటు,
డోర్ నెం. 6B-2-87, పోణంగి రోడ్
ఏలూరు దక్షిణపు వీధి, ఏలూరు - 534001.
తేది.13.08.2024 సెల్:9885576667